W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

30-6-2025







## చెదిరిన గ్రామాల కోసం
# తుమ్మల విజ్ఞప్తి

తెలంగాణ పౌరుల సుదీర్ఘ పోరాటానికి మరో కీలక ఘట్టం కదలికలోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదివారం కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ను కలిసి, భద్రాచలం పరిధిలోని నాలుగు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని స్పష్టమైన వినతిపత్రాన్ని అందించారు.

07



08

## ఆగ్రోఫారెస్ట్రీకి కేంద్రం
# గ్రీన్ సిగ్నల్..!

- వ్యవసాయ భూముల్లో చెట్లు నరికేందుకు ఇక నియమాలు సులభం
- ఎన్‌టీఎంఎస్ పోర్టల్‌లో చెట్లకు జియోట్యాగ్ తప్పనిసరి
- రైతుల కలలకు కొమ్ములు వేయనున్న కేంద్ర మార్గదర్శకాలు
- కలప పరిశ్రమలకు సమన్విత గేట్వే కేంద్రం తాజా చర్యలు



07 03

## ఆషాఢ బోనాల
# కోలాహలం

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధి లోని గుర్రాలచెరువు గ్రామంలో ఆషా ఢ మాస బోనాలు ఆదివారం ఘనం గా నిర్వహించ బడ్డాయి. గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచే మహిళా భక్తులు మట్టికుండల్లో నైవేద్యం వండి, బోనాలను నెత్తిన పెట్టుకొని ఆలయానికి ఊరేగింపుగా బయలుదేరి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. బోనాల ఊరేగింపు గ్రామమంతా పండుగ శోభను సంతరించుకుంది.

## భద్రాచలం మహిళలకు
# ప్రధాని మోదీ ప్రశంస

భద్రాచలం, మహా

## లండన్ దాకా ఆదివాసి మహిళల మిల్లెట్ విజయం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఓ గుంపు ఆదివాసి మహిళలు తమ సమష్టి శ్రమతో దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు అందుకున్నారు. వారు తయారుచేసిన మిల్లెట్ బిస్కెట్లు ప్రస్తుతం దేశవిదేశాల్లో ముచ్చటగా మారాయి. వారే కాదు - శానిటరీ నాప్కిన్ల తయారీలోనూ స్వయం ఉపాధితో ముందంజ వేసిన వీరి కథ, అభివృద్ధి కోరుకునే గ్రామీణ మహిళలకు గొప్ప ప్రేరణగా నిలుస్తోంది. నేటి మనకి బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ కథను దేశం ముందు ఉంచారు.



### మహిళా సాధికారతకు మోడీ సెల్యూట్

ఈ బిస్కెట్ల తయారీతోపాటు, అదే మహిళల బృందం తక్కువ సమయంలో భారీ పరిమాణంలో శానిటరీ నాప్కిన్లను తయారు చేయడాన్ని ప్రధాని అభినందించారు. "ఇవే మహిళలు మూడు నెలల వ్యవధిలో 40,000 శానిటరీ నాప్కిన్లను తయారు చేసి విక్ర యించారు. ఇవి స్థానికంగా అమ్ముడవు తూనే, స్వచ్ఛమైన మహిళా ఆరోగ్యానికి దోహదపడుతున్నాయి. వారి శ్రమ, విజ్ఞానం, పట్టుదల చూస్తే దేశానికి గర్వపడేలా ఉంది" అని మోదీ అన్నారు.



07

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

## సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్

## సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను




**తిరుమలాయపాలెం, మహా:** జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ ( మార్క్సిస్ట్ ) జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ ,సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను కార్మికులకు,కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గజ్జల వెంకటయ్య భవనంలో పార్టీ సీనియర్ నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు అధ్యక్షుడు జరిగిన మండల కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ కనీస వేతనం రూ 26000 ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, నెలకు కనీస పెన్షన్ రూ 9000 ఇవ్వాలని, కార్మిక వ్యవసాయ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, పెరుగుతున్న అధిక ధరలను నియంత్రించాలని, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలను ఆపివేయాలని, విద్యా వైద్యం ఫ్రీగా అందించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, కేంద్ర రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అటవీ హక్కుల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని తదితర 18 రకాల డిమాండ్స్ తో ఈ సమ్మె జరుగుతుంది అని ఈ సమ్మె జయప్రదానికి కార్యకర్తలు శక్తివంతం లేకుండా కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ సమ్మె గ్రామీణ సమ్మెగా పిలుపునిస్తున్నట్లు, అన్ని గ్రామాల్లో సమ్మె విజయవంతం కావాలని ఆయన అన్నారు. ప్రతి కార్మికుడు కార్మికురాలు ఈ సమ్మె జయప్రదంలో కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు నిజమైన లబ్ధిదారులకు ఇవ్వాలని, ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండకూడదని అని అన్నారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఆందోళన నిర్వహించి నిజమైన అర్హులకు ఇల్లు వచ్చే విధంగా ఉద్యమిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వేగినాటి మంగతాయారు, వర్షపొంగు వీరన్న, గురువులు, కోడి లింగయ్య, యశోద, లింగస్వామి, కొమ్ము నాగేశ్వరరావు, సైదులు, రాజశేఖర్, బాబు, ప్రసాద్, గాదె వరుణ్, ఉమేష్, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పగడాల విజయ్ పై పీడీ యాక్ట్ అమలు : పోలీస్ కమిషనర్



**ఖమ్మం క్రైమ్, మహా:** చట్టవిరుద్ధమైన కార్యకలాపాలలో పాల్గొని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న పగడాల విజయ్ ఏ చంటి 35సం,, పై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా జిల్లాలో తరచూ తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న వారిపై తీసుకునే చట్టపరమైన కఠిన చర్యలలో భాగంగా ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అగ్రహారం న్యూ కాలనీ చెందిన పగడాల విజయ్ హత్యయత్నం, దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులు, గుండాయిజం వంటి పలు కేసుల్లో కీలకమైన నిందితుడిగా వున్నట్లు తెలిపారు. పలు సందర్భాల్లో పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించినా, మళ్లీ అనతికాలంలోనే జామిని పై విడుదలై ఖమ్మంలో తరచూ తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.. ఇలాంటి అలవాటు పడిన నిందితుడి వల్ల ప్రజల భద్రతకు ముప్పు కలుగుతుందనే ఉద్దేశ్యంతో ఇతని నేరాలు శాశ్వతంగా చెక్ పెట్టడానికి పి.డి యాక్ట్ అమలు చేసి నిందుతుడిని ఖమ్మం ఖానాపూరం హవేలి ఇనస్పెక్టర్ భాను ప్రకాష్ ఆధ్వర్యంలో హైదరాబాదు చంచల్ గూడ సెంట్రల్ జైలు తరలించినట్లు తెలిపారు.

## ఉద్యమకారుల దీక్షను విజయవంతం చేయండి



**ముదిగొండ, మాహా:** జూలై 3, 4, 5 తేదీల్లో హైదరాబాద్లో జరిగే ఉద్యమకారుల దీక్షను విజయవంతం చేయాలని ఉద్యమకారుల సంఘం అద్యక్షులు అంజిరెడ్డి కోరారు. మండల పరిదిలోని వనంవారి కిష్టాపురం గ్రామంలో ఉద్యమకారుల దీక్షకు సబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ హక్కుల సాధన కోసం హైద్రాబాద్లోని ఉస్మానియా క్యాంపస్లో దీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సాధనలో ఉద్యమాలు చేసి ఎంతో కోల్పోయామనీ స్వరాష్ట్రంలో తమకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ఉద్యమకారలకు ఇచ్చిన హామీలను తక్షనమే అమలు చేయాలని కోరారు. కాంగ్రేస్ పార్టీ ఎన్నికల మ్యేనిఫోస్టే ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. ఉద్యమకారలకు 250 గజాల ఇల్ల స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. తమకు సముచిత రీతిలో పింఛన్లు ఇవ్వటంతో పాటు ఉద్యోగ నియామకాల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కుదురుపాక ఉదయ్, పరికపల్లి యల్లయ్య, యంద్రాతి కొండల్రావు, వట్టి నాగరాజు, పుల్లయ్య, విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

## కాలువలోకి దూసుకెళ్లిన లారీ





**వైరా, మహా:** ఖమ్మం జిల్లా వైరా మండలం సోమవరం గ్రామం వద్ద సోమవారం ఉదయం రోడ్డుప్రమాదం జరిగింది. రాజమండ్రి నుంచి జగ్గయ్యపేట వెళ్తున్న రెండు లారీలు ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఢీకొన్న ప్రభావంతో ముందున్న లారీ అదుపుతప్పి వైరా రిజర్వాయర్ ప్రధాన కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్కు గాయాలయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. గాయపడిన డ్రైవర్ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో పెద్ద ప్రమాదం తృటిలో తప్పిందని స్థానికులు ఊపిరిపిల్చుకున్నారు.

## 9వ మైలు తండా బోనాల కోలాహలం





**టేకులపల్లి - మహా :** టేకులపల్లి మండలం 9వ మైల్ తండా గ్రామం ఘనంగా నిర్వహించిన బోనాలు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం ఉమా- సురేందర్ పాల్గొని గ్రామంలోని ఆడపడుచులతో కలిసి సందడిగా గ్రామ దేవతలకు బోనాలు సమర్పిస్తూ వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో ఆనందంగా ఉండేటట్టు దీవించు తల్లి అని ఊరి ఆడబిడ్డలు తల్లికి బోనం సమర్పించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, బానోత్ భద్రు,పోషాలు, శివ, భూక్యా సర్దార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు






# ఆషాడ బోనాల కోలాహలం

## కనకదుర్గమ్మ ఆలయంలో భక్తుల సందడి

**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలచెరువు గ్రామంలో ఆషాఢ మాస బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచే మహిళా భక్తులు మట్టికుండల్లో నైవేద్యం వండి, బోనాలను నెత్తిన పెట్టుకొని ఆలయానికి ఊరేగింపుగా బయలుదేరి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. బోనాల ఊరేగింపు గ్రామమంతా పండుగ శోభను సంతరించుకుంది. ధూప దీప నైవేద్యాలు, విచిత్ర వేషధారణలు, కళాత్మక ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో కిక్కిరిసిపోయింది. చిన్నా పెద్దా, మహిళా పురుషులు కలిసి కోలాహలంగా బోనాల ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ప్రతి ఏటా ఆషాఢ మాసంలో కనకదుర్గమ్మకు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఉదయాన్నే లేచి, భక్తిశ్రద్ధలతో నైవేద్యాన్ని సిద్ధం చేసి బోనాలను అమ్మవారికి సమర్పిస్తాం. అమ్మవారు కోరికలు తీర్చే తల్లిగా కొలుస్తాం. ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో కురవాలని, రైతులకు పంటలు నష్టపోకుండా లాభాలను అందించాలని మొక్కుకున్నాం అని తెలిపారు. బోనాల పండుగను వీక్షించేందుకు మండల వ్యాప్తంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వివిధ రకాల నైవేద్యాలు, మొక్కుల చెల్లింపులతో గ్రామ వీధులు భక్తి శ్రద్ధలతో నిండిపోయాయి. గుర్రాలచెరువు గ్రామంలో జరిగిన ఈ బోనాల వేడుకలు ఉత్సవంగా కనువిందు చేశాయి.




# కలెక్టర్ సారూ.. సాయం చేయండి



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 29 (మహా):** గత మే నెల మొర్రేడు వాగులో ఈతకు వెళ్లి కరెంటు షాక్ తగిలి చనిపోయిన మేడి. సోమశేఖర్ తల్లిదండ్రులు మేడి. హరి మరియు తల్లి ప్రశాంతి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కి మొర పెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే గత నెల మే 29 కొత్తగూడెం నియోజకవర్గం లక్ష్మీదేవి పల్లి మండలం లోని అశోక్ నగర్ వద్ద గల ముర్రేడు వాగులో గత నెల మే 19 వ తారీఖున ఈతకు వెళ్లిన కుర్రాళ్ళలో తమ కుమారుడు మేడి సోమశేఖర్ అదే వాగులో నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ మోటార్లు అమర్చడం వలన విద్యుత్ మోటార్ల షార్ట్ సర్క్యూట్ వలన కరెంట్ షాక్ తగిలి తమ కుమారుడు మరణించినాడని న్యూ గొల్లగూడెం, లక్ష్మీదేవి పల్లి మండలం నివాసి అయిన మేడి సోమశేఖర్ తండ్రి అయిన హరి కలెక్టర్ కు విన్నవించాడు. కానీ లక్ష్మీదేవి పల్లి పోలీస్ వారు సరియైన విచారణ జరపకుండా కుమారునికి ఈత వచ్చినప్పటికీ ఈత రాక నీళు మింగి చనిపోయాడని ధ్రువీకరించి తమకు అన్యాయం చేశారని, ఎవరైతే వాగులో విద్యుత్ మోటార్లు అమర్చారో, వారిపై కేసు నమోదు చేయకుండా వదిలేశారని, కనుక కేసు రీ ఎంక్వయిరీ జరిపి తమ కుమారుడి మరణానికి కారణమైన వాగులో నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ మోటార్లు అమర్చినటువంటి వారు ఎవరైతే ఉన్నారో వారిపై హత్య నేరం కేసు నమోదు చేయాలని, కేసు సరియైన దర్యాప్తు చేయకుండా నిర్లక్ష్యం వహించినటువంటి లక్ష్మీదేవి పల్లి పోలీస్ వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం చేయాలని కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.

# గంటే భాస్కర్ రావును సన్మానించిన కాంగ్రెస్ నాయకులు తుమ్మలపల్లి రమేష్..



**తల్లాడ, జూన్, 30( మహా):** తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిహెచ్ఓ గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన గంటే భాస్కర్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మలపల్లి రమేష్ సన్మానించారు. ఆదివారం ఖమ్మం లోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్ లో పదవి విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని భాస్కర్ రావు దంపతులను శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించి తల్లాడ మండలంలో ప్రజలందరితో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించారని, పదవి విరమణ అనంతరం ఆయన శేష జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

# తేహాన్స్ శౌర్యను ఆశీర్వదించిన సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య..



**తల్లాడ, జూన్, 30, ( మహా ):** తల్లాడ పట్టణానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వరరావు జివి ఆర్, నాగమణి దంపతుల మనవడు శశిధర్, సింధు దంపతుల కుమారుడు తేహాన్స్ శౌర్య అన్నప్రశన్న వేడుక ఆదివారం లోని గార్ల ఒడ్డు గ్రామంలోని శ్రీ నరసింహ స్వామి దేవాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య హాజరై చిన్నారికి అక్షింతలు వేసి దీవించారు. ఈ సందర్భంగా జివిఆర్ కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడెం వీర మోహన్ రెడ్డి , కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్, నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఉచిత ఇసుక సరఫరాకు పటిష్ట చర్యలు

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, మహా:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా ఉచితంగా ఇసుక సరఫరాకు పటిష్ట చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. బోనకల్ మండలంలోని కలకోట, బ్రాహ్మణ పల్లి, రాయన్న పేట, ముదిగొండ మండలంలో గంధసిరి, గంగాపురం, పెద్ద మండవ, చింతకాని మండలంలో చిన్న మండవ, మధిర మండలంలో కమ్మంపాడు, చిలుకూరు, నక్కల గరుబు, ఎర్రుపాలెం మండలంలో తక్కెల పాడు, ఇంగాలి, చొప్పకట్లపాలెం, తిరుమలాయపాలెం మండలంలో ముజిడు పురం, హైదర్ సాయి పేట, కూసుమంచి మండలంలో జక్కేపల్లి, తల్లాడ మండలంలో గొల్లగూడెం, వైరా మండలంలో ఖానాపురం, వెప్పలమడక వద్ద ఇసుక రీచ్ లను గుర్తించడం జరిగిందని కలెక్టర్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తుందని, ఎటువంటి సీనరేజి చార్జిలు ఉండవని అన్నారు. మండల హౌసింగ్ శాఖ ఏ.ఇ. ఇందిరమ్మ లబ్ధిదారుల వివరాలు, ఇంటి నిర్మాణ స్థలం, అవసరమైన ఇసుక వివరాలతో సంబంధిత తహసిల్దార్ కు నిర్ణీత నమూనాలో ప్రతిపాదనలు అందిస్తారని కలెక్టర్ తెలిపారు. ఏఇ అందించిన ప్రతిపాదనలు ఆధారంగా తహసిల్దార్ లబ్దిదారులకు కూపన్ జారీ చేస్తారని, ఆ కూపన్ 3 రోజుల వరకు చెల్లుబాటు అవుతుందని అన్నారు. తహసిల్దార్ జారీ చేసిన కూపన్ ఆధారంగా సంబంధిత పంచాయతీ కార్యదర్శి ట్రాక్టర్ వే బిల్లు జారీ చేస్తారని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు జిల్లాలో ఏ ఇసుక రీచ్ నుంచైనా తమకు కేటాయించిన ఇసుక తీసుకుని వెళ్ళవచ్చని అన్నారు. ఇసుక రీచ్ లను స్వశక్తి మహిళా సంఘాలు పర్యవేక్షిస్తారని, లబ్ధిదారులు వారికి కేటాయించిన మేర మాత్రమే ఇసుక లోడు తీసుకుని వెళ్లాలని కలెక్టర్ తెలిపారు. ఇసుకను కేవలం మనుషులు మాత్రమే లోడ్ చేయాల్సి ఉంటుందని ఎటువంటి మేషినరీ వాడకం అనుమతి లేదని అన్నారు. ఎడ్ల బండ్లు లేదా ట్రాక్టర్ల ద్వారా మాత్రమే ఇసుక తరలించాల్సి ఉంటుందని, ఉదయం 6.00 నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు మాత్రమే ఇసుక తరలింపు చేయాలని, రాత్రి వేళలో ఇసుక తరలింపుకు అనుమతి లేదని కలెక్టర్ తెలిపారు. ఇట్టి సదుపాయాన్ని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.



# జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన భద్రాద్రి గిరిజన మహిళలు

**మహా భద్రాచలం:** భద్రాచలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ( ఐ టీ డి ఏ ) ద్వారా మిల్లెట్ బిస్కెట్స్ తయారు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పై ప్రధాని మోదీ అభినందించారు. ఐ టీ డి ఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ ప్రత్యేక ప్రణాళికలు ద్వారా గిరిజన మహిళలకు ఉపాధి కల్పించేందుకు శిక్షణ ఇప్పించి చిరు ధాన్యాలతో బిస్కెట్స్ తయారీ యూనిట్స్ నెలకొల్పారు. ఈ బిస్కెట్స్ అతి తక్కువ ధరలో ఆరోగ్యానికి మేలు చేసేవి కావడంతో తక్కువ సమయంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఈ విధంగా గిరిజన మహిళలు తమ కాళ్ళపై తాము నిలబడి వ్యాపారం చేస్తూ ఖ్యాతి గడించడాన్ని భారత ప్రధాని మోదీ మన్ కీ బాత్ లో ప్రస్తావించారు. ఆదివారం భద్రాచలం వచ్చిన కలెక్టర్ జితేష్ వి పాటిల్ బిస్కెట్స్ తయారీ యూనిట్స్ పరిశీలించి పి ఓ రాహుల్, గిరిజన మహిళలను అభినందించారు.



# స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

**మహా భద్రాచలం:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్ భద్రాచలం, లయన క్లబ్ జటాయువు, వికాస తరంగిణి అధ్వర్యంలో యంఎన్ జె కేన్సర్ ఆసుపత్రి హైదరాబాద్ బృందము 'పుష్పగిరి కంటి ఆసుపత్రి' సికింద్రాబాద్ బృందం సహకారంతో ఆదివారం భద్రాచలంలోని మారుతి నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ, చికిత్స మరియు నేత్ర శస్త్ర చికిత్స శిబిరమును ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే తెల్లం, కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లా డుతూ, భద్రాచలం గిరిజన ప్రాంతంలో కంటి చూపు తక్కువ తో చాలా మంది బాధపడుతున్నారని, అదే విధంగా గర్భకోశ వ్యాధులు, రొమ్ముల్లో గడ్డలతో మహిళలు బాధపడుతున్నారని ఇటువంటి పేద ప్రజల, ఆదివాసీ గిరిజనుల ఆరోగ్యం సంరక్షించేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ బ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిబిరములు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగప డతాయ ని, స్వచ్ఛంద సంస్థల సేవలను అభినం దిం చినారు. రెడ్ క్రాస్ సంస్థ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ కాంతారావు, దామోదర్రావు, యస్. వెంకటపుల్లయ్య పాల్గొన్నారు.

# ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయకుండా తిప్పేస్తున్నారు: టీజీబీ మేనేజర్

**టేకులపల్లి - మహా:** బోమ్మనపల్లి లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయకుండా తిప్పిస్తూ ఇబ్బంది పెడుతున్నారని బాధితురాలు పెద్దగోని నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు . ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ %ా% ఏప్రిల్ 11 నాడు తన భర్త రవి అనారోగ్యం తో మృతి చెందాడని తెలిపారు. తన భర్త కు రెండు లక్షల ఇన్సూరెన్స్ వచ్చిందని క్లెయిమ్ చేయడానికి డాకుమెంట్స్ తేవాలని బ్యాంకు మేనేజర్, మరియు ఫీల్డ్ ఆఫీసర్ చెప్పారని అన్నారు . అలాగే డ్వాక్రా అప్పు ఉన్నదని అది చెల్లిస్తేనే ఇన్సూరెన్స్ డబ్బులు ఇస్తానని మేనేజర్ అన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చాక ఇస్తానని చెబితే ఒప్పుకోకుండా ఇన్సూరెన్స్ డబ్బుల నుంచి డ్వాక్రా అప్పు కట్ చేసి మిగిలింది ఇస్తానని మేనేజర్ చెప్పడం తో తప్పనిసరి పరిస్థితి లో ఒప్పుకుని మేనేజర్ చెప్పిన దాని ప్రకారం 03/05/2025 నాడు నాకు వచ్చే ఇన్సూరెన్స్ డబ్బుల నుంచి డ్వాక్రా అప్పు 50 వేలు జమ చేసుకోవాలని అంగీకారం తెలుపుతూ లేఖ తో పాటు మేనేజర్ అడిగిన దాని ప్రకారం ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసం కావాల్సిన అన్ని డాకుమెంట్స్ కలర్ జిరాక్స్ లు జత చేసి ఇస్తే మేనేజర్ కి ఇస్తే అన్నీ చెక్ చేసి ఓకే అని చెప్పి తీసుకోకుండా మళ్ళీ నాకే ఇచ్చి నేను పిలిచినప్పుడు వచ్చి ఇవ్వు అని చెప్పడం తో వెళ్లిపోయానని పేర్కొంది. రెండు మూడు అయినా పిలుపు రాకపోవడం తో బ్యాంకు కి వెళ్లి అడిగితె రేపు రా పో అన్నదని వాపోయింది . ఇలా రేపు మాపు అంటూ 03/05/2025 నుంచి తిప్పుతున్నదని ఇదేమిటని అడిగితె అనవసరంగా గట్టిగా అరుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అవకాశం ఉన్నప్పటికీ ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయకుండా మేనేజర్ కావాలని ఎందుకు జాప్యం చేస్తున్నదో అర్థం కావడం లేదని వాపోయింది . ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలనీ కోరింది.

## మండలంలో సిపిఐ పార్టీ 13వ మహాసభ

### విచ్చేయనున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు



**టేకులపల్లి - మహా :** టేకులపల్లి మండల 13వ మహాసభ సోమవారం ఉదయం 10 గంటలకు సిపిఐ మండల కార్యదర్శి గుగులోత్ రామ్ చందర్ ఇంటి వద్ద జరుగును. ఈ మహాసభకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూన నేని సాంబశివరావు. సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎస్ కె షాబీర్ పాషా. ఇల్లందు నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ కే సారయ్య. జిల్లా నాయకులు దేవరకొండ శంకర్ హాజరు కానున్నారు. కావున సకాలంలో మండల కార్యవర్గ సభ్యులు. కౌన్సిల్ సభ్యులు. శాఖ నూతన కార్యదర్శులు. కార్మికులు ప్రజా సంఘాల నాయకులు మహిళ రైతులు విద్యార్థి యువజన గిరిజన సమాఖ్య అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని మహాసభను విజయవంతం చేయాలని రామ్ చందర్ కోరారు.

## సేవాకార్యక్రమాలతో బాలిక పూజితకు నివాళులు



**తల్లాడ, జులై, 30( మహా):** రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన బాలిక పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలతో నివాళులర్పించారు. తల్లాడ మండలం రామానుజవరం గ్రామంలో రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన అయిలూరి పూజిత పుట్టినరోజు సందర్భంగా ఆదివారం కుటుంబ సభ్యులు, స్థానిక ప్రముఖులు, ఉపాధ్యాయులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.కళాశాల హాస్టల్లో ఉండడం ఇష్టం లేక శుక్రవారం రాత్రి పురుగు మందు తాగి పూజిత ఆత్మహత్యకు పాల్పడింది.ముందుగా పూజిత చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూజిత జ్ఞాపకార్థం మొక్కలు నాటారు.స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శీలం కోటారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి శీలం శివపార్వతి, స్థానిక ప్రముఖులు శీలం శ్రీనివాసరెడ్డి, శీలం నాగిరెడ్డి పాల్గొన్నారు.

## మీడియాపై దాడులుచేస్తే క్రిమినల్ కేసులు పెట్టాలి



**భద్రాద్రి కొత్తగూడెం, (మహా):** మీడియాపై దాడులు చేసే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టవద్దని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ అన్నారు. మహా న్యూస్ టీవీ ఛానల్ ఆఫీస్ పై బి ఆర్ ఎస్ గుండాలు దాడి చేసే విధ్వంశాలు సృష్టించడాన్ని నివసిస్తూ కొత్తగూడెంలో విలేకరులు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ సెంటర్లోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మీడియాపై దాడులు చేయడాన్ని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలన్నారు. మీడియాపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పార్టీలు ఏవైనా గాని అది అధికారపక్షమైన, ప్రతిపక్షమైన మీడియా స్వేచ్ఛను కాపాడకపోతే సమాజం ముందుకు పోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఎర్రాఈశ్వర్ లక్ష్మణ్ రాజేందర్ బాదావత్ దశరథ్, రాజేష్, ఖలీమ్, భాస్కర్, శివ కృష్ణ కృష్ణంరాజు, అనిల్ సిహెచ్ .వి.నరసింహారావు, శేఖర్, రవికుమార్, బాబు, నజీర్, మజీద్ , రాందాస్ , శ్రీను, కొప్పుల రమేష్, పిట్టల రమేష్ , గండికోట కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బోనకల్ మండల క్లస్టర్ ఇన్చార్జీ ల రివ్యూ మీటింగ్ కు హాజరైన కాంగ్రెస్ నాయకులు



**మధిర, మహా:** మధిర క్యాంప్ కార్యాలయం నందు, మల్లు నందిని విక్రమార్క ఆధ్వర్యంలో జరిగిన బోనకల్ మండల క్లస్టర్ ఇన్చార్జీ ల రివ్యూ మీటింగ్ కు హాజరైన బోనకల్ మండల కాంగ్రెస్ నాయకులు.

# మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్ గురించి ఎటువంటి ఫోన్ కాల్స్ చేయడం లేదు

**ఖమ్మం, మహా:** మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్ గురించి ఎటువంటి ఫోన్ కాల్స్ చేయడం లేదని, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పేరిట వస్తున్న ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ఖమ్మం జిల్లాలోని పెద్ద పెద్ద భవనాలు, ఆసుపత్రులు, వాణిజ్య వ్యాపారవేత్తలకు 9346423925 నెంబర్ నుంచి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ చేసినట్లుగా ఫేక్ ఫోన్ కాల్స్ చేసి ట్రేడ్ లైసెన్స్ డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నారని, ప్రజలు వ్యాపారులు ఎవరు ఎటువంటి ఫోన్ కాల్స్ ను పట్టించుకోవద్దని, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఎటువంటి ఫోన్ కాల్స్ ద్వారా బిల్లుల సేకరణ జరగదని అన్నారు. ఫేక్ కాల్స్ నమ్మి ఎవరు డబ్బులు చెల్లించి మోసపోవద్దని, ఇటువంటి ఫోన్ కాల్స్ పై ఇప్పటికే సైబర్ క్రైమ్ లో ఫిర్యాదు నమోదు చేశామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమీషనర్ పేర్కొన్నారు.

# మీడియాపై దాడి హేయమైన చర్య



**మధిర, మహా:** మధిర నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చేబ్రోలు రమ. రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగిస్తూ, అన్ని వర్గాల ప్రజలు సంతోషాలతో ఉంటుంటే ఓర్వలేని టిఆర్ఎస్ నాయకులు వారి ఉనికి కోసం ప్రెస్ మీట్ లు పెడుతూ అభివృద్ధి ప్రదాత లిభట్టి విక్రమార్క పై ఆరోపణలు చేయడం నీచమైన చర్య. 10 సంవత్సరాల టిఆర్ఎస్ పరిపాలనలో రాష్ట్రాన్ని దివాలా తీయగా నేడు ఆర్థిక మంత్రిగా ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతూ, అభివృద్ధి,సంక్షేమానికి వెనకాడకుండా రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పై కమల్ రాజు బోనకల్ లో ప్రెస్ మీట్ పెట్టి అవాకులు, చవాకులు మాట్లాడడం మానుకోవాలి. భట్టి విక్రమార్క విమర్శిస్తే పెద్ద నాయకుడు అవుతారేమో అనుకొని కమల్ రాజు మాట్లాడుతున్నారు. ఈ తీరు మారకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు.

# ప్రేక్షకులను అలరించిన సినీ సంగీత విభావరి







**ఖమ్మం సిటీ, మహా:** స్వర సుధా మ్యూజిక్ యూనిట్ ఖమ్మం వారి 33వ వార్షికోత్సవ సందర్భంగా 29.6.205 న ఆదివారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రం నందు సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 10 గంటల వరకు సంగీత విభవాని ప్రేక్షకులను ఎంతగానో అల్లరించి నిర్వాహకులు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో సృజనహిత డాక్టర్ శ్రీమతి వనం కృష్ణవేణి, ప్రత్యేకంగా సన్మా గ్రహీత శ్రీమతి పూసలూరి శ్రీలత గారికి ప్రత్యేకంగా సన్మానించడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేసినారు నెల నెల వెన్నెల అధ్యక్షులు ఎస్ కుమార్ గారు పాల్గొన్నారు అదేవిధంగా ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా కే మాధవరావు ఉపాధ్యక్షులుగా వి.వి రెడ్డి కోశాధికారి పి.జే వినయ్ కుమార్ వేదిక పర్యవేక్షకులు పిన్నేల్లి యాదగిరి తదితరులు కార్యక్రమంలో గాయనీ గాయకులు కీర్తన బి ప్రియాంక, వి. రేవతి, జనార్ధన్, స్వప్న, రాయపోలు సుబ్రహ్మణ్యం ఆర్ మధు గానం చేసి ప్రేక్షకుల అందించారు కార్యక్రమంలో పాల్గొంటారు. పాల్గొన్న ప్రేక్షక దేవుళ్లకు ప్రజలందరూ అభినందనలు తెలియజేస్తున్నాను

# రైతు వేదికలపై సోలార్ దీపం

## స్వయం సమృద్ధికే సోలార్ ప్రణాళిక... రైతు వేదికలకు ఆదాయ మార్గం

### రేషన్ డీలర్స్ సమస్యలపై జాయింట్ కలెక్టర్ జిల్లా పౌరసరఫాలశాఖ అధికారికి వినతి పత్రం అందజేత




**ఖమ్మం, మహా:** రైతు సమస్యలపై మౌలికంగా పరిష్కారాలను కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం నూతన దిశగా అడుగులు వేస్తోంది. 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన రైతు వేదికల నిర్మాణ యజ్ఞం.. నేటికీ నిర్వహణ నిధుల లభ్యత లేక రైతు విస్తరణాధికారులకు భారంగా మారిన పరిస్థితిని పరిగణలోకి తీసుకొని, నూతనమైన ఆలోచనతో ముందుకెళ్తోంది ప్రభుత్వం. విద్యుత్ బకాయిలతో కొట్టుమిట్టాడుతున్న వేదికలకు శాశ్వత పరిష్కారంగా... వాటిపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా నిత్యాదాయ మార్గాన్ని ప్రభుత్వం అన్వేషిస్తోంది. ఈ ప్రయత్నంలో భాగంగా ప్రధాని కుసుమ్ యోజన కింద రైతు వేదికలు, మార్కెట్ యార్డులు, రైతుబజార్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటుకు వ్యూహం రూపొందుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఈ ప్రయత్నం మొదలవ్వడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికలు 'స్వయం సమృద్ధి కేంద్రాలుగా' రూపాంతరం చెందనున్న వాతావరణం నెలకొంది. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ వ్యవసాయ పురోగతికి సంకేతంగా నిర్మితమైన రైతు వేదికలు, ఇప్పుడు సోలార్ ఆధారిత ఆదాయ మార్గంగా పరిణమించనున్నాయి. 2021లో ప్రతి ఐదు వేల ఎకరాల వ్యవసాయ భూమికి ఒక క్లస్టర్‌గా గుర్తించి.. ఒక్కో క్లస్టర్‌కు రైతు వేదిక నిర్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ప్రారంభ నిధులు మంజూరు చేసినప్పటికీ నిర్వహణ నిధులు తక్కువగా ఉండటంతో ఈ వేదికలు గత కొంతకాలంగా ఇబ్బందుల్లో పడుతున్నాయి. ఇందులో భాగంగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 250 పైగా రైతు వేదికలను నిర్మించారు. విద్యుత్ బిల్లులు చెల్లించలేక విద్యుత్ కట్ అవడం, కార్యాలయాలు పాడైపోవడం వంటి సమస్యలు విస్తృతంగా ఎదురవుతున్న నేపథ్యంలో.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వేదికలకు స్వయం ఆదాయం పొందే అవకాశాన్ని అందించేందుకు ముందడుగు వేసింది. ప్రత్యేకంగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ అవసరాలను తీరుస్తూ.. మిగులు విద్యుత్‌ను విద్యుత్‌శాఖకు విక్రయించి ఏటా రూ.25 వేలు ఆదాయం పొందేలా ప్రణాళిక రూపొందించారు. ప్రధాన మంత్రి కుసుమ్ యోజన కింద చేపట్టిన ఈ ప్రాజెక్టు మొదటగా ఖమ్మం జిల్లాలో పైలట్‌గా అమలవుతోంది. అక్కడి ఐదు రైతు వేదికలపై ఇప్పటికే సోలార్ యూనిట్లు అమర్చగా, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు రెడ్కోతో కలిసి కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఒక్కో వేదికపై 5 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ అమర్చనున్నారు. దీనివల్ల విద్యుత్ ఖర్చులు తగ్గడమే కాదు.. స్వయం ఆదాయ మార్గం ఏర్పడి వేదికల నిర్వహణలో చక్కదిద్దే అవకాశముంటుంది. రైతు నేస్తం వంటి పథకాల అమలులో రైతు వేదికల అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం, విద్యుత్ బకాయిలను తొలగించేందుకు కొంతమేర నిధులు విడుదల చేయనుంది. దీని ద్వారా ఇప్పటివరకు నిష్క్రియంగా ఉన్న వేదికలు మళ్లీ చురుకుగా మారే అవకాశం ఉంది. గ్రామీణ రైతుల చట్టప్రబోధ, శిక్షణా కేంద్రాలుగా రూపొందిన రైతు వేదికలు.. నూతన మార్గదర్శకాలు రూపుదిద్దుకుంటున్న ఈ తరుణంలో.. స్వయం సమృద్ధికే ఈ సోలార్ వ్యూహం ఊతమిచ్చే అవకాశముంది.

# బొక్కలతండాలో ఘనంగా బోనాల వేడుక



**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం బొక్కలతండా గ్రామంలో ఆదివారం ఆషాఢమాస బోనాల వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గ్రామదేవతలైన బొడ్రాయి కి మహిళలు జలాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా మేళతాళాలు, డప్పు నృత్యాల మధ్య మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ముత్యాలమ్మ అమ్మవార్లకు పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. బోనాల వేడుకల్లో దేవతామూర్తుల వేషదారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బోనాల వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈబోనాల కార్యక్రమంలో గ్రామ పెద్దలు బానోత్ రాందాస్, మాలోత్ భావుసింగ్, అజ్మీర నారాయణ, మాలోత్ పత్య, వాంకుడోత్ బాబులాల్, భూక్య హాతిరాం, హలావత్ రాంబాబు, కుమార్, లక్మ పాల్గొన్నారు.

# భద్రాచలం మహిళలకు ప్రధాని మోదీ ప్రశంస

## లండన్ దాకా ఆదివాసి మహిళల మిల్లెట్ విజయం





**భద్రాచలం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఓ గుంపు ఆదివాసి మహిళలు తమ సమష్టి శ్రమతో దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు అందుకున్నారు. వారు తయారుచేసిన మిల్లెట్ బిస్కెట్లు ప్రస్తుతం దేశవిదేశాల్లో ముచ్చటగా మారాయి. వారే కాదు %–% శానిటరీ నాప్కిన్ల తయారీలోనూ స్వయం ఉపాధితో ముందంజ వేసిన వీరి కథ, అభివృద్ధి కోరుకునే గ్రామీణ మహిళలకు గొప్ప ప్రేరణగా నిలుస్తోంది. నేటి మనకి బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ కథను దేశం ముందు ఉంచారు. భద్రాచలం నుంచి లండన్ దాకా 'మిల్లెట్ మ్యాజిక్' ప్రధాని మోదీ తన ప్రసంగంలో "భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్" పేరిట ఆదివాసి మహిళలు తయారు చేస్తున్న బిస్కెట్లను ప్రత్యేకంగా ప్రస్తావించారు. సేంద్రియంగా ఉత్పత్తి చేస్తున్న ఈ మిల్లెట్ బిస్కెట్లు ఇప్పుడు హైదరాబాద్ నుంచే కాకుండా లండన్‌కు కూడా ఎగుమతవు తున్నాయన్న విషయం దేశం దృష్టిని ఆకర్షించింది. భద్రాచలం, దుమ్ముగూడెం, చింతూరు ప్రాంతాల నుండి సేకరించిన మిల్లెట్లు (సామలు, కొర్రలు, వరగులు) ఆధారంగా ఈ బిస్కెట్లు తయారు అవుతున్నాయి. ఈ బిస్కెట్ల తయారీతోపాటు, అదే మహిళల బృందం తక్కువ సమయంలో భారీ పరిమాణంలో శానిటరీ నాప్కిన్లను తయారు చేయడాన్ని ప్రధాని అభినందించారు. "ఇవే మహిళలు మూడు నెలల వ్యవధిలో 40,000 శానిటరీ నాప్కిన్లను తయారు చేసి విక్రయించారు. ఇవి స్థానికంగా అమ్ముడవుతూనే, స్వచ్ఛమైన మహిళా ఆరోగ్యానికి దోహదపడుతున్నాయి. వారి శ్రమ, విజ్ఞానం, పట్టుదల చూస్తే దేశానికి గర్వపడేలా ఉంది" అని మోదీ అన్నారు. ఆదివాసీ మహిళలు నూతన ఆర్థిక మార్గాల్లోకి అడుగుపెడుతున్న విధానాన్ని ప్రధాని నరేంద్ర మోదీ అభినందించడం, మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామీణ యువతకి, మహిళా స్వయం సహాయక బృందాలకు ఈ సంఘటన ఒక మార్గదర్శకంగా మారనుంది. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, మార్కెటింగ్ పట్ల అవగాహన పెరిగితే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మన్నించదగిన స్థాయిలో ముందుకెళ్తుందనే విషయంలో ప్రధాని సందేశం ఎంతో ప్రేరణాత్మకం. సాంప్రదాయ ధాన్యాల ఆధారంగా, స్థానికంగా లభించే వనరులను వినియోగించుకుని ఆదివాసీ మహిళలు సాధించిన ఈ గౌరవం రాష్ట్రానికే కాదు, దేశానికే గర్వకారణం. ఒకప్పుడు అడవిలోని గ్రామాలలో చిన్న స్థాయిలో మొదలైన ఈ ప్రయాణం, లండన్ బజార్ల వరకూ సాగడం వెనుక ఉన్న శ్రమకు మోదీ సెల్యూట్ చేయడం, వారికి మరింత ఉత్సాహాన్ని కలిగించనిదిగా అర్థం అవుతోంది. భద్రాచలం మహిళలు చూపిన ఈ విజయం %–% మిల్లెట్ మ్యాజిక్ బిస్కెట్ల రూపంలో ప్రపంచ మార్కెట్ దాకా పయనించి, సాంకేతికతతో పాటు సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తోంది. ఇది మహిళా సాధికారతకు ఒక చక్కటి ఉదాహరణ.



## ఇల్లెందులో సిపిఐ 18వ మహాసభ

### ప్రజల హక్కుల కోసం ఎర్రజెండా పోరాటం

**ఇల్లెందు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో జరిగిన సిపిఐ 18వ పట్టణ మహాసభలో ప్రజా సమస్యలపై స్పష్టమైన ధ్వని వినిపించింది. కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఈ సభకు బొల్లి కొమరయ్య, కుమ్మరి రవీందర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలకు ఎర్రజెండా అండగా ఉంటుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిన విధానాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. "ఆపరేషన్ కగార్" పేరుతో మావోయిస్టులపై దాడులు కొనసాగుతున్నాయని విమర్శించారు. ఉపాధి అవకాశాలు పెంచాలని, నిత్యవసర ధరలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో తాగునీరు, వైద్యం, విద్య ఇంకా మెరుగుదల అవసరమన్నారు. ప్రజలతో భాగస్వామ్యంగా పని చేయాల్సిన అవసరముందని సూచించారు. సింగరేణి గనులపుట్ట ఇల్లెందులో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం బాధాకరమన్నారు. జెకె 5 ఓసి ప్రాజెక్టు విస్తరణ వల్ల భూములు కోల్పోయిన వారికి ప్యాకేజీ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇల్లెందులోని 8 వేల ఇండ్లకు 76వ జీఓ ద్వారా పట్టాలు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల్లో అర్హులైన వారికి న్యాయం చేయాలని చెప్పారు. నిర్వాసితుల హక్కుల కోసం సిపిఐ, ఏఐటీయుసీ కలిసి పోరాడతామని తెలిపారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర నేతలు మిర్యాల రంగయ్య, కె.సారయ్య, దేవరకొండ శంకర్, ఎండి.నజీర్, దాసరి రాజారాం, బాస శ్రీనివాస్, ఉడుత ఐలయ్య, బంధం నాగయ్య, చాట్ల గణపతి, కమటం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# చెదిరిన గ్రామాల కోసం తుమ్మల విజ్ఞప్తి

**ఖమ్మం, మహా:** తెలంగాణ పౌరుల సుదీర్ఘ పోరాటానికి మరో కీలక ఘట్టం కదలికలోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను కలిసి, భద్రాచలం పరిధిలోని నాలుగు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని స్పష్టమైన వినతిపత్రాన్ని అందించారు. నిజామాబాద్‌లో జరిగిన పసుపు బోర్డు ప్రారంభోత్సవం సందర్భంగా అమిత్ షా ను కలిసిన తుమ్మల, ఆ గ్రామాల పరిస్థితులపై ఓ సంక్షిప్త కానీ గంభీరమైన విజ్ఞప్తిని చేశారు. 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని అమలు చేసే సమయంలో, భద్రాచలం మండలం కేంద్రంగా ఉన్న నాలుగు గ్రామ పంచాయతీలు ‒ యాటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం ‒ అనూహ్యంగా ఏపీలో కలిసిపోయాయి. భద్రాచలం పట్టణం తెలంగాణలో కొనసాగుతున్నప్పటికీ, ఈ గ్రామాలపై పరిపాలన, అభివృద్ధి బాధ్యతలు మాత్రం ఏపీ ప్రభుత్వానికి అప్పగించబడడం స్థానికుల జీవితాల్లో అనేక అవ్యవస్థలు, అవాంతరాలు తెచ్చింది. ఈ గ్రామాల వాసులు, ముఖ్యంగా గిరిజనులు, భద్రాచలంలోని ప్రభుత్వ కళాశాలలు, హాస్పిటల్స్, ఇతర ముఖ్య సేవల కోసం రోజూ తెలంగాణ ప్రాంతానికి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితిలో ఉన్నారు. అయితే చెక్‌పోస్టుల వద్ద ఆగాల్సిన పరిస్థితులు, ఏపీ%–%తెలంగాణ మధ్య నిబంధనల సంక్షోభం వలన వీరికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాణిజ్య వాహనాలకు అనుమతుల సమస్యలు, విద్యార్థులకు లోపమైన రవాణా సదుపాయాలు, స్థానిక ప్రజలకు పౌర హక్కులపైనే ఆందోళన కలిగించే స్థాయికి చేరుకున్నాయి. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిపాలన కూడా ఈ విచిత్ర విభజనకు బలైంది. ఆలయ భూముల పలు విభాగాలు ఇప్పటికీ ఏపీ పరిపాలనలో ఉండడం వలన, ఆలయ అభివృద్ధి పనులు, దాతల విరాళాల వినియోగంపై నిరంతర అనుమానాలు ఏర్పడుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ భూముల యాజమాన్యం తెలంగాణ దేవాదాయ శాఖకు స్పష్టంగా లభించకపోతే భవిష్యత్తులో అర్థరహిత పరిపాలన ఉత్పన్నమవుతుందని ఆయన హెచ్చరించారు. భద్రాచలం పరిసర గ్రామాలు ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత ప్రాంతంగా గుర్తించబడిన నేపథ్యంలో, రెండు రాష్ట్రాల పరిపాలనా వ్యత్యాసాలు శాంతిభద్రతలకు కూడా సవాళ్లుగా



మారుతున్నాయి. సమాచార ప్రసారంలో ఆటంకాలు, పోలీస్ వ్యవస్థలో సమన్వయం లోపించడం వలన అక్కడి ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

### తుమ్మల విజ్ఞప్తి స్పష్టం

ఈ సమస్యలన్నిటినీ పరిగణలోకి తీసుకొని, తగిన చట్టపరమైన, పరిపాలనా చర్యలు తీసుకోవాలని తుమ్మల లేఖలో పేర్కొన్నారు. 2014 పునర్విభజన చట్టంలో వీటికి సంబంధించిన ప్రవేశికలు ఉన్నందున, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తక్షణ స్పందన ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఏపీలో కలిసిపోయిన నాలుగు గ్రామ పంచాయతీలు భద్రాచలంతో జీవన సంబంధం కలిగి ఉండగా, పరిపాలనలో విడిపోయి బాధలు చవిచూస్తున్నాయి. భద్రాచలం మతపరమైన, సామాజిక, భౌగోళిక ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ గ్రామాల వాస్తవ విలీనమే ప్రజల హక్కులకు న్యాయం చేస్తుందని తుమ్మల తలపించారు. ఇప్పుడు బంతి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కోర్టులో ఉంది.



# ఆగ్రోఫారెస్ట్రీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్..!

## వ్యవసాయ భూముల్లో చెట్లు నరికేందుకు ఇక నియమాలు సులభం

## ఎన్‌టీఎంఎస్ పోర్టల్‌లో చెట్లకు జియోట్యాగ్ తప్పనిసరి

### రైతుల కలలకు కొమ్మలు వేయనున్న కేంద్ర మార్గదర్శకాలు

### కలప పరిశ్రమలకు సమన్విత గేట్వే - కేంద్రం తాజా చర్యలు

**ఖమ్మం, మహా:** దేశ వ్యాప్తంగా వ్యవసాయ భూముల్లో వృక్ష సంపదను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక ఆగ్రోపరిష్కారానికి నాంది పలికింది. వాతావరణ మార్పులు, ప్రకృతి పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి %-% ఈ మూడు లక్ష్యాలను ఒకే దారిలో చేరుస్తూ, వృక్షాల పెంపకానికి కొత్త మార్గాలను తెరిచింది. వ్యవసాయ భూముల్లో చెట్లు నాటి, వాటిని నరికి, రవాణా చేయడం మొదలైన ప్రక్రియలను దశలవారీగా సులభతరం చేస్తూ నమూనా నిబంధనలను రాష్ట్రాలందరికీ పంపింది. ఈ చర్యల ద్వారా ఒకవైపు రైతులకు అధిక ఆదాయం లభిస్తే, మరోవైపు పర్యావరణ పరిరక్షణలోనూ దేశం ముందడుగు వేస్తుంది. వ్యవసాయ రంగానికి పునాది వలె నిలిచే విధంగా, కేంద్ర పర్యావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. ఆగ్రోఫారెస్ట్రీగా ప్రసిద్ధిపొందిన వ్యవసాయ భూముల్లో వృక్షాల పెంపకాన్ని ముమ్మరంగా ప్రోత్సహించేందుకు గాను, చెట్ల నరికివేతను సులభతరం చేసే నమూనా నిబంధనలు రాష్ట్రాలకు పంపించింది. ఈనెల 19న జారీ చేసిన లేఖలలో స్పష్టంగా రైతులకు మద్దతుగా ఉన్న ఉద్దేశాలు ప్రతిఫలించాయి. ఇప్పటివరకు వ్యవసాయ భూముల్లో వృక్షాలను నరకాలంటే అనేక అనుమతులు, విచారణలు, రెవెన్యూ అధికారుల అడ్డంకులు ఎదురయ్యేవి. ఇది రైతుల్లో నిరుత్సాహానికి దారి తీసింది. ఇదే ఆగ్రోఫారెస్ట్రీ అభివృద్ధికి ప్రధాన అవరోధమని కేంద్రం గుర్తించి, ఆ అవరోధాన్ని తొలగించే దిశగా స్పష్టమైన మార్గదర్శకాలను తీసుకొచ్చింది.



### ఎస్ఎల్‌సీల కీలక బాధ్యత

2016 నాటి 'కలప ఆధారిత పరిశ్రమల మార్గదర్శకాలు' కింద ఏర్పాటైన రాష్ట్రస్థాయి కమిటీలైన ఎస్ఎల్‌సీలు ఈ కొత్త నిబంధనల అమలుకు కీలక పాత్ర పోషించనున్నాయి. వీటివల్ల చెట్లను నరికి, కలపను రవాణా చేయాలంటే ఎక్కడికక్కడ అనుమతులు కావాల్సిన అవసరం లేకుండా అవతలవుతుంది.

### ఎన్‌టీఎంఎస్ పోర్టల్‌తో పూర్తి డిజిటలీకరణ

ప్రక్రియ మొత్తాన్ని జాతీయ టింబర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌కి తీసుకువచ్చారు. చెట్లు నాటే రైతులు తమ భూమి, నాటిన తేదీ, చెట్ల జాతి, ఎత్తు వంటి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రతి చెట్టు జియోట్యాగ్ చేసి, ఫొటో అప్‌లోడ్ చేయాలి. తరువాత నరికే సమయంలో మళ్లీ ఫోటోలు అప్లోడ్ చేసి, నరికే తేదీని తెలపాలి. దీనితో పాటు ఆటోమేటిక్‌గా నిరభ్యంతర సర్టిఫికెట్ జారీ అవుతుంది.

### రైతులకు లాభం

ఈ విధానం వల్ల రైతులు తమ భూముల్లో వేయే వృక్షాలను భవిష్యత్‌లో ఆదాయ వనరుగా మలచుకోవచ్చు. పర్యావరణానికి హానికరం కాకుండా చెట్లను నరికి, కలపను అమ్ముకోవచ్చు. ఇదే సమయంలో కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గి, భూ ఉపరితల ఉష్ణోగ్రత నియంత్రణకు సహాయపడుతుంది.

### ఆదాయానికి అడుగు....

ఈ కొత్త మార్గదర్శకాలు దేశవ్యాప్తంగా ఫార్మ్ ఫారెస్ట్రీ, సోషియో ఎకానమిక్ కలప ఆధారిత పరిశ్రమలు, పునరుత్పాదక వనాల అభివృద్ధికి బీజాలు వేస్తున్నాయి. రైతులకు ఇది పంటల మధ్యకాలంలో స్థిర ఆదాయ మార్గాన్ని కల్పించే ప్రయత్నం. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని సమర్థంగా అమలు చేస్తే, దేశవ్యాప్తంగా పచ్చదనం విస్తరించి, వ్యవసాయ రంగానికి కొత్త ప్రాణం పోసే అవకాశముంది.